సమిధలు

తూరుపింకా ఎర్రబడలేదు....

కాపోళ్ళ బావి గిలక 'కిర్ కిర్' మంటూ శబ్దం చేస్తోంది - అలా శబ్దమయిందంటే తెల్లారుతున్నట్టే లెక్క కొల్లప్పకి. జీతగాళ్ళని తెల్లారకనే లేపి నీళ్ళు తోడిస్తారు కాపులు.

కొల్లప్ప గుడిసె కెదురుగా ఉన్న గుడిసెలోంచి మారెక్క నిద్దర లేపుతోంది బిడ్డని - 'లెయ్యే ఎల్లమ్మా ! పొద్దు పుడతాది.... లేసి ముద్దకెసరు బెట్టు' అంటూ.

ఆ హరిజన వాడలో దాదాపు అన్ని ఇళ్ళల్లో తమ పిల్లల్ని ఆ వేళకే లేపుతారు ముసలోళ్ళు. ఆ వేళకే లేచి.... నీళ్ళు తెచ్చుకొని వంట చేసే టప్పటికి పొద్దు పొడుస్తుంది. కొంత తిని, కొంత చద్ది కట్టుకుని పోతారు కూలికి.

కొల్లప్ప ఎడం వేపుకి పొర్లి పడుకున్నాడు. గుడిసెలోకుండల చప్పుడవుతూంటే - 'నారమ్మ లేసినట్లుంది.... నెలలు నిండినాయి గదా ఇయ్యాలకే లెయి కుంటేనేం' అనుకున్నాడు.

నారమ్మ కొల్లప్ప కోడలు. ఎనిమిదేండ్ల కిందట ఆ ఊరికి కలరా సోకినప్పుడు నారమ్మ అయ్యా, అమ్మా సరైన వైద్యంలేక కన్నుమూశారు. అప్పణ్ణించి నారమ్మ తన అక్క బావల దగ్గరే పెరిగింది. సంవత్సరం

కిందట కొల్లప్ప తన ఒక్కగానొక్క కొడుకయిన పోతప్పకి పెళ్ళి చేసు కొచ్చాడు నారమ్మని. కోడలంటే కొల్లప్పకి ప్రాణం. పోతప్ప ఎప్పుడయినా నారమ్మని కొద్దిగా కసురుకున్నా — "ఆ పాపదేం తప్పురా!" అని ఒంటి కాలిమీద పోయేవాడు పోతప్ప మీదికి. కూతురున్నా అంత బాగా చూసుకునే వాడు కాదేమో!

కొల్లప్ప మనసు గుబులు గుబులుగా ఉంది. లేచి గొంతు కూర్చున్నాడు. కళ్ళుమండుతున్నాయి. అలా కళ్ళు మండుతున్నందుక్కారణం రాత్రంతా నిద్దర లేకపోవడమే.

మామూలుగా ఏ దగ్గు ఆయాసంతోనో, ఇంట్లో గింజలు లేవన్న దిగులుతోనో, చనిపోయిన కొడుకుని తలుచుకునో, పెళ్ళయిన ఆర్నెళ్ళకే ముండమోసిన నారమ్మని తలుచుకునో, నారమ్మ కడుపున పుట్టబోయే తండ్రిలేని బిడ్డని తలుచుకునో నిద్దరొచ్చేది కాదు కొల్లప్పకి. కానీ, ఆరాత్రంతా కొల్లప్పకి నిద్దర లేక పోవడానికి ఇవేవి కారణాలుకావు....

క్రితం రోజు సంధ్యవేళ ఇంటికొస్తూనే కోడలు కాచియిచ్చిన గంజి యింతతాగి గుడిసెబయట చిరుగుల కంబళి కప్పుకొని కూచున్నాడు - తాపీగా బీడీ అంటించుకుని తాగుతూ. ఆసమయంలో మల్లేసు వచ్చి చెప్పాడు "కేశవరెడ్డీ, మల్లారెడ్డి ఇద్దరూ యాకమైనా" రని. ఒక్కసారి ఉలిక్కి పడ్డట్టు "నిజమా?" అన్నాడు బీడీ నోటికాడి వరకూ పోయి ఆగిపోయింది. 'అవు' నన్నాడు మల్లేసు. కొల్లప్ప గుండెల్లో కలుక్కుమన్నట్టయింది.

"ఈ పెద్దోల్లకి సిగ్గూ, ఎగ్గూ లేదు మామా!" అన్నాడు మల్లేసు. వినిపించు కున్నట్టు లేదు కొల్లప్ప. ఆలోచిస్తున్నాడు - దేన్నిగురించో.

ఉన్నట్టుండి— "ఒరే మల్లేసూ! యిద్దరూ యాకమైతే యట్లరా....

మన పోతిగాని కేసు యేట్లో గలిసినట్లేనా?" — ఆ కంఠంలో చెప్పలేనంత బాధ ఉంది, బరువు ఉంది, ఆవేదన ఉంది.

ఆ బాధకూ, ఆ బరువుకూ, ఆ ఆవేదనకూ కారణం చాలా ఉంది.

దాదాపు ఆర్నెల్ల కిందట పంచాయితెన్నికలొచ్చాయి. ఎప్పట్లాగే కేశవ రెడ్డి ప్రెసిడెంటు ఎన్నికకి పోటీ చేశాడు.... ఎన్నో రోజుల్నుంచి మల్లారెడ్డికి కూడా ప్రెసిడెంటు కావాలని చాలా మోజుంది. "ప్రెసిడెంటు మల్లారెడ్డి" అని ప్రజల్తో పిలిపించుకోవాలని బోల్డంత ఆశుంది. తన మోజూ, ఆశ తీర్చు కోడానికి కేశవరెడ్డికి పోటీగా నిలబడ్డాడు. నిజానికి పోటీ దార్లిద్దరూ దగ్గర బంధువులే, ఇంకా చెప్పాలంటే బావ బామ్మరుదులు కూడా. పదవీ వ్యామోహానికి బంధుత్వం అడ్డురాదుగా - దాంతో వారిద్దరి మధ్యనా శత్రుత్వం వాళ్ళకి తెలీకుండానే చోటు చేసుకుంది.

ఆ ఎన్నికల్లో కేశవరెడ్డికి కొల్లప్ప కొడుకు పోతప్పే కుడి బుజంగా ఉన్న అంగరక్షకుడూ, ప్రచారకుడూను. పోతప్ప చేస్తున్న సేవను మెచ్చు కున్నప్పుడల్లా మురిసి పోయేవాడు కొల్లప్ప. తన కొడుకెంతో ప్రయోజ కుడయినట్టు ఉబ్బిపోయి— "ఆడు అంతే సామీ, పిల్లప్పన్నించీ యాపని కయినా గుండ్లు దీసిన బంటు" అనేవాడు. "వాని బయంబక్తి సూస్తే నాకెంత యిష్టమనుకున్నావ్! వచ్చే యాడాది నించి వాని కింకొక యాబయి ఎక్కిస్తారా, జీతం" అని కేశవరెడ్డి అన్నప్పుడు కొల్లప్ప ఆనందానికి పట్ట పగ్గాల్లేవు. ఆ మాటని ఆరోజంతా ఊరంతా చెప్పుకున్నాడు.

ఎలక్షన్లు దగ్గర పడే కొద్దీ ప్రచారం విపరీతంగా మారింది. ఇరుపక్షాల్లో కోపాలూ ఉద్రేకాలు తారస్థాయి చేరుకున్నాయి, నువ్వెంతంటే నువ్వెంత అని వ్యక్తి గతమైన కొట్లాటలు గూడా జరిగాయి. ఎన్నికల్రోజు రానే వచ్చింది. పోతప్ప ఇంటింటికీ తిరిగి ప్రతి మనిషి వెంట పోలింగ్ బూతు వద్దకు వెళ్ళి ఓటేయించాడు. తన కులంవాళ్ళందరికీ కేశవరెడ్డి

యిచ్చిన డబ్బుతో కల్లు, సారా పోయించాడు. ఓట్లేయించాడు. ఏమయితేనేం, కేశవరెడ్డి మంచి మెజారిటీతోటే గెలిచాడు.

ఆ రోజు సాయంత్రం పోతప్ప వరిమడికి నీళ్ళు పారించి వస్తున్నాడు మల్లారెడ్డి పెద్ద కొడుకు తిప్పారెడ్డి, అతని పాలేరు ఓబిలేసు దార్లో ఎదురయినారు - గడ్డి వాముకిపోతూ. పోతప్పని చూస్తే తిప్పారెడ్డికి అరికాలినుంచీ మండుతుంది" కేశవరెడ్డి గెలవటానికి మూల కారణం వాడేనని హరిజనవాడలోని వోట్లన్నీ తమకే వస్తాయని అనుకున్నాడు తిప్పారెడ్డి. కాని పోతప్ప మూలాన హరిజన వోటర్లంతా తమకి వేయలేదు.... అందుకే పోతప్ప మీద కుత్తిక వరకూ వుంది కోపం.

అంత దూరంలో పోతప్పని చూడగానే ఓబిలేసు చెవిలో ఏదో చెప్పాడు. సరేనన్నట్టు తలూపాడు ఓబిలేసు. పోతప్ప దగ్గర కొస్తున్నట్టుగానే- "తూ.... ఈ నెక్క దొంగ లంజ కొడుకులు. కల్లూ, సారాయీ పోయిచ్చి దొంగోట్లు ఏపిచ్చినారు. అట్ల గెలిసేదేం పెద్ద సుద్ది.... ఆడిది గెలుత్తుంది. ఇట్లా నా కొడుకులుంటే దొంగోట్లెన్నన్నా పడ్తాయి" అన్నాడు ఓబిలేసు.

పోతప్పకి ఛర్రున మండింది. ముందుకెళ్ళినవాడు, వెనక్కి తిరిగొచ్చి "నీకి యేగితుంటే యాల గెలిపించలే మీ యయ్యని" అన్నాడు, కోపంతో ఊగిపోతూ- ఈ అదను కోసమే నక్కలా పొంచున్న తిప్పారెడ్డి పోతప్ప మెడ కరుసుకొని కింద పడేశాడు. ఎడాపెడా కాల్తో తన్నాడు. తప్పు చేసినవాడిలా చూస్తున్నాడు కొంచెం దూరంలో నిలబడ్డ ఓబిలేసు - "ఊరికే అంటినే" అన్న పశ్చాత్తాపం అతని మొహంలో కనబడుతోంది. ఆపాలని వారించ బోయాడు, తిప్పారెడ్డి ఓ తోపు తోసి, నడుంలో ఉన్న కత్తితో పొడిచాడు పోతప్ప కడుపులోకి. చావుకేక పెట్టాడు పోతప్ప. ఆ కేకలకి దూరంగా గడ్డివాముల్లో, వొడ్డెండ్లలో వున్న మనుషులొచ్చారు.

అప్పటికి కొన ఊపిరితో ఉన్నాడు పోతప్ప. తిప్పారెడ్డి అప్పటికే పరారయాడు. ఆ పోగయిన వారు పోతప్పని కేశవరెడ్డి ఇల్లు చేర్చారు... చంపిన వాడీ పేరు చెప్పి ప్రాణాలొదిలాడు పోతప్ప.

పోతప్ప ఖూనీ చెయ్యబడ్డం కేశవరెడ్డి అహం మీద దెబ్బకొట్టి నట్టయింది. పోలీసుల్ని పిలిపించి కేసు బనాయించాడు. తిప్పారెడ్డికి ఉరిశిక్ష పడుతుందనే నమ్మకంతోనే జీవిస్తున్నాడు కొల్లప్ప. "తిప్పారెడ్డిగాన్ని ఉరికంబ మెక్కిచ్చేదంకా నేన్నిద్దర పోను" అని కేశవరెడ్డి హామీ యిచ్చాడు కూడా.

కాని.... యిప్పుడు మల్లేసు మాటల్ని బట్టి చూస్తే.... అంతా తారుమారయినట్టుంది. అందుకే ఆ బాధ! బరువు! ఆవేదన!!!

"మల్లేసూ.... ఏకమెట్లయినార్రా? ఇద్దరి మద్దెనా పచ్చగడ్డేస్తే బగ్గుమని కాలిపొయ్యేది గదా.!"

"నీకేం తెల్దు మామా.... మద్దెంతరెన్నికలనీ యిప్పుడొచ్చినాయి"

"ఎట్లెట్లా?" అంతకు ముందు కాల్చి ఆర్పేసిన బీడీని వెలిగించాడు.

"పట్నంలో యమ్మెల్లే సుబ్బరాయుడు గుండెబట్టికోని సచ్చిపోలేదా మూన్నెల్ల కిందట? ఆయప్ప సచ్చిపోయిందానికి, ఆ తానంలో మల్లా ఎలచ్చన్లు జరిపిత్తన్నారు. రంగారెడ్డి యిప్పుడు పోటీజేత్తన్నాడు. నిన్ననే మనూరికి ఆయప్పొచ్చినాడు లోపల్లోపల ఏమేమ్మాట్లాడు కుండారో యేమో.... రెడ్లంతా ఒగటయినారు.

"అదెట్లా నా కరతంగాలే"

"రంగారెడ్డికి పోటీగా నిలబడినాయప్ప కమ్మాయప్ప. కమ్మోళ్లు కమ్మోళ్లు అంతా ఒకటయినారు. దాన్నించి రెడ్లు గూడా అంతా ఒకటయినారు"

"ఒగటి కాకుంటే పన్నెండు గాన్లే.... మన పోతిగాని కూనీ కేసేం జేస్తార్రా ?" మల్లేసుకే ఆ జవాబు కూడా తెలిసుంటుందన్నట్టు అడిగాడు.

"ఏమో మామా! రెండెద్దులూ జోడాయె, నేను బీడాయె అని వాళ్ళు వాళ్ళు ఒగటయితే ఇంగెక్కడి కేసు మామా.... నేను బొయ్యొస్తా, మాయమ్మ బిర్రీన్రమ్మన్నేది" అని చెప్పేసి వెళ్ళి పోయాడు మల్లేసు.

కొల్లప్ప ఆలోచనలు ఎట్లెట్లో పోతున్నాయి.... కేశవరెడ్డి ఆ పొద్దు యిచ్చిన మాట తప్పుతాడా? ఆయప్ప మాట తప్పినా కోర్టులోనన్నా నాయం జరగదా? తన కొడుకు ఎవురి పరంగా ఉండి సచ్చింది కేశవరెడ్డికి గ్యాపకం లేదా! .... పంచాయితెన్నికల్లో శత్రువులయినోల్లు, మద్దెంతర ఎన్నికల్లో ఎట్లొగటయితారు? అంతకు ముందుండే పాత కచ్చలు అపుడే మర్చి పొయ్యినారా! కులం ఒగటయితే, ఏం జేసినా అన్నేయమనిపించదా!

వెంటనే కేశవరెడ్డి ఇంటి వద్దకుపోయి అతన్ని లేపి అడగాలని ఉంది. తనికి అన్నేయం సెయ్యొద్దని కాళ్ళు బట్టుకొని బతిమాలు కోవాలని ఉంది. అసలుకి___ తను పోయి లేపితే ఈ వేళకాడ లేస్తాడా ప్రెశిడెంటు కేశవరెడ్డి- "పద్దనికి రాపోరా.... యాలా పాలా లేదా ?" అని కసురుతాడో! ....

కేశవరెడ్డి కేసు రద్దు చేయిస్తానంటే తనుండి ఏం ప్రయోజనం? తన బతుక్కి ఫలితమేముంది? బోరున యాడవాలన్నా గొంతులో ఏదో పడ్డట్టు పూడుకు పోయి ఉంది. "పద్దన్నే పోయి అడగల్ల" అనుకుని కంబళిని తల వరకూ కప్పుకొని గొంతు కూచున్నాడు.... ఏవేవో ఆలోచనలు తన చుట్టూ మెదలుతూనే ఉన్నాయి.... అందుకే కొల్లప్పకి నిద్దర రాలేదు రాత్రంతా....

అప్పుడే తెల్లారింది.... గుక్క తిప్పుకోకుండా దగ్గు వస్తున్నా ఈ ఆలోచనల ముందు అదేమంత లెక్కలోకి రాకుండా పోయింది.

*   *   *   *

కొరకొర పొద్దు పొడిచింది.

కేశవరెడ్డి ఇంటి వద్దకు బయల్దేరాడు కొల్లప్ప. గుడిసె వాకిట్లోనించి కోడలు దీనంగా చూస్తోంది. 'ఏ మౌతుందో ఏమో' అన్నట్టుంది ఆమె మొహం.... కొల్లప్పని చూస్తుంటే.

దారిలో వెంకన్న ఎదురయి— "యాటికిరా పోతా వుండావు" అని పలకరించాడు కొల్లప్పని. వెంకన్న కొల్లప్పకంటే వయసులో చాలా పెద్దవాడు. కొల్లప్ప యే విషయం అయినా సరే వెంకన్నతో చెబితేనే మనసు కుదుటబడేది. తను పోతున్న విషయం తెలియ పరిచాడు.

"ఎంత పనయిందిరా! మూడు దినాల కిందట తిప్పారెడ్డిని వురికంబ మెక్కిచ్చేదంకా నిద్దర పోనని కేశవరెడ్డి చెప్పినాడంటివి.... అపుడే మారి పోయుంటాడా?.... అదే ముండదులే అడిగి సూడి.... ఈళ్లని నమ్మేకి లేదురా దొంగ నా కొడుకులు. ఎప్పుడేకమయితారో, ఎప్పుడు పగదార్లయితారో సెప్పేకొచ్చెల్లేదు.... కేసు రద్దు సేపిత్తానంటే ఆనెంక ఆలోసిద్దాం గాని, నువ్వు ముందు పొయిరా; నేను ఎగవ సేన్లో ఉంటా-అన్నిసయాలు సెప్పు" అని చెప్పి వెళ్ళి పోయాడు వెంకన్న.

కొల్లప్ప వెళ్ళేటప్పటికి కేశవరెడ్డీ, అల్లుడు క్రిష్ణారెడ్డి ఇద్దరూ ఎదురూ బదురుగా ఎత్తులో ఉన్న అరుగు మీద కుర్చీలో కూచుని ఉన్నారు. దేన్ని గురించో చాలా సీరియస్‌గా మాట్లాడు కుంటున్నారు.

కొల్లప్ప పోయి, వాళ్ళుకూచున్న అరుగుకి నాలుగు గజాల దూరంలో నిలబడ్డాడు. పిలవలేదు. పిలిస్తే యామను కుంటారో నని.

కేశవరెడ్డి, క్రిష్టారెడ్డి, శరీరాల లావులో ఏ మాత్రం ఒకరికొకరు తీసిపోరు. నలభై ఏళ్ళకు తగిన హుందా, గాంభీర్యం ఉన్నాయి కేశవరెడ్డికి. ముప్పయి ఏళ్ళ వాడయినా మీసాలు పైకెగదువ్వి తన అహాన్నంతా మీసాల్లోనే కనబరుస్తాడు క్రిష్టారెడ్డి.... వీరి ఆకారాలకి పూర్తిగా భిన్నం కొల్లప్ప ఆకారం. జుట్టులాగే ఎడ్డి మడ్డిగా పెరిగిన గడ్డం, లోకంలోని దైన్యమంతా ఒక్క చోటే కాపురం చేస్తోన్న కళ్ళూ, ముడతలు పడి మరీ నల్లగా కనిపించే శరీరాన్ని చూస్తే కొల్లప్ప వయసుని టక్కున చూడగానే ఎవరూ అంచనా వేయలేరు. ఒకవేళ అంచనా వేసినా తప్పకుండా తప్పే అవుతుంది. ముఖ్యంగా ఆర్నెల్లకిందట కొడుకు కూనీ చేయబడ్డప్పట్నించి పదేళ్ళు ఎక్కువగా ముసురు కున్నాయి. పొరపాట్న పని చేసుకుంటూ పొలంలో చనిపోతే కాకి పీకేందుకు కండయినా ఉండదేమో అనిపిస్తుంది....

"ఏమో, కొల్లిగాడొచ్చినాడు మామా!" అంటూ కళ్ళెగరేసి చెప్పాడు క్రిష్టారెడ్డి వెనక్కి తిరిగి చూసి.

"ఏరా! కొల్లిగా యింత పద్దన్నే వస్తివి" అన్నాడు కేశవరెడ్డి.

"నువ్వూ, మల్లారెడ్డీ యాకమైనారంట గద సామీ!"

"అవును, నీకింగా తెల్దా ?"

"మరి, మా పోతిగాని కూనీ కేసూ...." అంటూ నీళ్ళు నమిలాడు కొల్లప్ప.

"ఓ.... అదా.... అందుకేనా? నువ్వొచ్చింది. ఇపుడర్థమాయె— ఇపుడర్థమాయె...." అంటూ అల్లుడి వేపొకసారి చూశాడు కేశవరెడ్డి. తను 'అప్పుడే ఇదంతా పసిగట్టాను' అన్నట్టు తలూపాడు క్రిష్టారెడ్డి.

కొల్లప్పకు ఎదురుగా ఉండేలా కుర్చీని తిప్పుకుని కూచుంటూ అన్నాడు కేశవరెడ్డి— "బలే మనుసుల్రా.... నేనూ, మల్లారెడ్డి యాక మైనా మంటానే పోతిగాని కూనీ కేసే రద్దు చేస్తామని అను కుండావ్.... మేమిద్దరూ యాకమయితే కచ్చలుండవు కదా! కూనీ కేసు రద్దయితే మాత్రమేమి?"

"ఊర్లో ఎకస్పార్టీల్లేకుంటే కొట్లాటలు ఉండవుగదా !" మామగారి మాటలకి చిలక పలుకులతో తాళం వేశాడు అల్లుడు.

"మీకు పున్నెముంటాది సామీ! అట్లసేయద్దండ్రి.... మీ కాళ్ల బట్టుగుంటా "

"నీ మాటే నువు మాట్లాడ్తావుగాని, మా మాట గూడా కొంచె మినరా.... ఊరు సల్లగుండల్లంటే మేమిద్దరం యాకమయితేనే గదరా! ఉత్తరమూ, దక్షిణమూ యాకమయిందానికి సంతోషించల్లగాని; పోతిగాని కూనీ కేసు కొట్టేస్తారు మొర్రో అని ఏడుస్తావేరా ఎర్రి లంజ కొడకా !"

"మీరు రాజీ అయ్యి యాకమయితే సంతోషమే సామీ! గానీ, పోతిగాని కూనీ కేసు కొట్టేపిత్తే మాత్తరం అన్నేయం సామీ!.... ఆ పొద్దు 'నీకొడుకుని సంపినోన్ని ఉరికంబమెక్కిత్తా కొల్లప్పా' అంటివి. ఈ పొద్దు జూత్తే యిట్ల మాట్లాడుతుండావ్"

"అవున్రా.... ఆ పొద్దంటి, ఆ పొద్దు నేనూ, మల్లారెడ్డీ యిరోదులం అందుకే అట్లంటి. ఈ పొద్దు మా మద్దెన ఆ యిరోదం లేదు. ఇంగొగ యినయం నీకి తెల్దనుకుంటా.... నేనూ మల్లారెడ్డి యియ్యమొల్లం కాబోతుం డాం.... అరతం గాలే?.... తిప్పారెడ్డికి నాబిడ్డనిచ్చి పెండ్లి సేస్తుండా కష్టాల్లో ఆదుకొనేది నాకులమొల్లేరా, మీరుగాదు" ఈ మాటలు ఎంతో వ్యంగ్య ధోరణిలో వచ్చాయి కేశవరెడ్డి నోటివెంట. కొల్లప్ప మనసు చివుక్కుమంది.

"ఎలచ్చన్లో మల్లారెడ్డి పారిటీ వోల్లు నీమింద సెయ్యి జేసుకుంటారని కంటికి రెప్పాకట్ల కాపల గాసిన మేమెట్ల కట్టాల్లో ఆదుకుంటాం సామీ. నీ గురించే గదా ఆ తిప్పారెడ్డి నాకొడుకుని సంపింది."

"దుడ్లు పారేస్తే వచ్చే మాదిగ నాయాండ్లు.... మీరు గూడా నన్నాదు కుంటారేంరా— కష్టాల్లో. ఆ పొద్దు నీకొడుకు నా గురించా సచ్చి పోయింది— నోర్ముయ్, తప్పున్నాకొడకా! నీ కొడుకు బాగా తాగొచ్చి అ తిప్పారెడ్డిని యిష్టమొచ్చినట్లు తిడ్తే ఊరికే యిడుస్తాడా సంపకుండా?"

"మీరు గొప్పోల్లు సామీ.... ఎట్లన్న మాట మారుత్తారు. అల్లతో రాజీ అయినంక అల్లు సేసినవన్నీ నీకి తప్పుగా కనబడవు, మీరు మీరు ఒగటయినారు."

"ఒరేయ్! ఎక్కువ మాట్లతో పన్లే.... రెండెకరాల బంజరిప్పిస్తా కర్నమయ్యతో జెప్ప.... నోర్మూసుకొని పో! పద్దన్నే ఏంటికి నా యింటి కాడ గోడో మంటావు"

కొల్లప్ప గుండె పిసికినట్లనిపించింది. తనపట్ల ఇంత అధ్వాన్నంగా ప్రవర్తిస్తున్నాడా కేశవరెడ్డి!! తను ఎన్నాళ్ళ నించో "దేవునట్లావోడు" అనుకుంటున్న కేశవరెడ్డి తనకింత అన్నేయం తలపెడుతున్నాడా! తన కొడుకు కేసు ఎంత తేలిగ్గా తీసుకుంటున్నాడు!! చివరికి— రెండెకరాల బంజరిప్పించి తన నోరు శాశ్వతంగా మూయించాలను కుంటున్నాడే!!!

"పప్పలు పెట్టి పోరు మాన్పేకి నేనేం పిల్లోన్నిగాదు సామీ! సెట్టంత కొడుకు నాకు దక్కకుండా బోయినాడు. నువ్విప్పించే రెండెకరాలు నాకు వొల్ల! నా కొడుకుని సంపినోనికి సిచ్చపడల్ల! "ఆడు ఉరికంబ మెక్కల్ల!!!" అంటూ తీవ్రంగా అన్నాడు కొల్లప్ప. అతని మొత్తం జీవితంలో అలా తీవ్రంగా ఆవేశంతో ఎవ్వరితోనూ మాట్లాడి ఉండడు.

కొల్లప్ప అలా మాట్లాట్టం చాలా ఆశ్చర్యంగా ఉంది కేశవరెడ్డికి.... క్రిష్ణారెడ్డి కూడా విస్మయంతో చూస్తున్నాడు.

"సిచ్చపడదు.... పడనీను. కేసు రద్దయి పోతాది, యింకా ఎక్కువ మాట్లాన్నావంటే కీళ్ళిరుస్తా నా కొడకా!", కళ్ళెర్ర జేస్తు గుడ్లురిమి అరిచాడు కేశవరెడ్డి.

కేశవరెడ్డి గొంతు గట్టిగా వినబడ్డంతో పొలం పనులకు పోతున్న వాళ్ళు, చుట్టు పక్కల వున్న వాళ్ళు అంతా గుమి కూడారు.

"పెద్దోల్లు సామీ! యామన్నా జేస్తారు. యాపక్కకన్నా తిరుగుతారు సామీ!.... మీరెట్ల తిరిగినా దొడ్డ గున మంటారు.... అదే మమ్మన్నయితే తప్పున్నా కొడుకులంటారు!.... అని కొల్లప్ప మాటల్ని సూటిగా వదలడంతో అగ్గి మీద ఆజ్యం పోసినట్టయింది.

"రేయ్!! ముసిలోడా!!! తల తిరుగుతాందా? తక్కువ కులానికి ఎక్కువ కూడు పెడితే తల తిక్కట మీ మాదిగ నాయళ్ళకాడ గవురవంగా మాట్లాడ గూడుదురా. ఇట్లే మాట్లాన్నేవంటే నీ రగతం కండ్ల సూస్తా, శంట్నించి ఎల్లిపో!!!" అంటూ గాండ్రించాడు కేశవరెడ్డి.

"నాయం జరుపే పెద్దొల్లే అన్నేయనికి దిగుతాంటే ఎట్లపోతాను? పోను....! పొయ్యేల్లేదు!! యేంజేసిన సరే!

"యేరా సెప్తా వుండేది నీక్కాదా!" ఉరిమాడు క్రిష్ణారెడ్డి.

"నాయం జరపండ్రి మడి పోతాను! మొండి కేస్తున్నట్టు మాట్లాడాడు కొల్లప్ప.

దాంతో రెచ్చిపోయాడు కేశవరెడ్డి. కుర్చీలోంచి లేచి వచ్చి "నీకి నాయం కావల్లా లంజ కొడకా!" అంటూ ఎదపైన చెయ్యేసి వెనక్కి

తోసాడు. దబ్బున వెల్లకిలా పడ్డాడు కొల్లప్ప.... లేచి కూర్చుని వెర్రిగా చూస్తూ అన్నాడు.

"నీ కొడుకునీ కూనీ సేసుంటే నీకీ నా బాదేందో తెల్సేది. దేవుడు గుడ్డోడు గాదు.... నా ఉసురు తగుల్తాది...." అంటూండగానే,

"నీ యమ్మ, ముసిల్లంజ కొడకా" అనరుస్తూ కొల్లప్ప కడుపు మీద సత్తువ కొద్దీ తన్నాడు. ఆ దెబ్బకు కొల్లప్ప అడ్డంబడి కడుపు పట్టుకొని చుట్టుకు పోయాడు.

చుట్టూ పోగయిన జనంలో కొద్దిగా కదిలిక వచ్చింది. అంతవరకూ మామూలు కొట్లాటగా చూస్తున్న జనం యింతదాకా జరగడంతో "ఇడిసి పెట్టప్పా! ఆ ముసిలోనితో ఏంది?" అని కొందరు "పాపం! కొడుకు పోయినప్పంన్నించి పిచ్చి పట్టినట్టుంది.... అట్ల వాన్నెందుకు దంతావు!" కొందరు అన్నారు.

" నీకి తెల్దూరు కోరా.... ఈ ముసిలోనికి కండ్లు నెత్తికెక్కినాయి. లమిడి కొడుకు నా యింటికాటి కొచ్చి యిష్ట మొచ్చినట్ల మాట్లాడ్తాడా! వొగరుస్తూ ఒక యువకుడికి చెప్పాడు కేశవరెడ్డి.

అంత వరకూ కన్నులపండగ్గా చూస్తోన్న క్రిష్ణారెడ్డికి వ్యవహార మంతా చప్పబడి పోయినట్టనిపించి జోక్యం కలగ జేసుకున్నాడు,

"యిడుసు మామా! ఇంగా రెండు.... ఇట్లా నా కొడుకుల్ని మూలాజా పెట్టగూడదు. అంచేపట్నించి సూస్తుండా యీని తల తిరుగుడు మాటలు.... యెయ్యి !!!"

కేశవరెడ్డి రెచ్చి పోయాడు అల్లుడి మాటలకి. అతని ఉద్రేకానికి ఊపిచ్చినట్టయింది. తన చేతి కర్ర తీసుకొని దెబ్బమీద దెబ్బ, దెబ్బ మీదదెబ్బ పదే పదే కొట్టాడు, "అమ్మా!.... అబ్బా!!" అంటూ పెడబొబ్బలు పెట్టాడు కొల్లప్ప.

"యాడుంచే నాకొడుకుల్ని ఆడుంచల్ల!" అంటూ కొల్లప్ప మూతి మీద తన్నాడు.

చితికిన శరీరంలో ఉండటం ఇష్టం లేక రక్తం బయటకు వచ్చింది. కళ్ళు తేలవేసి అస్పష్టంగా ఏదో గొణుగుతున్నట్టు పెదవుల్ని వణుకుతూ కదిలిస్తున్నాడు. కొల్లప్ప. అరిచే శక్తి లేక.

జనం మొహాలు జేవురించాయి.... తమ కళ్ళ ఎదుటే దారుణం! .... న్యాయాన్ని కాలరాస్తున్న అన్యాయం!! మంచిని మసిచేస్తున్న దగా....!!!

ఈ ఘోరాన్ని చూసి తీవ్రంగా ప్రతిఘటించాలని ఉంది. కాని.... ప్రతిఘటించి బతగ్గలమా? అనే భావన వాళ్ళని అచేతనంగా ఉంచింది.

* * * *

దీపాలు పెట్టే వేళయింది.... చీకటి దట్టంగా ముసురుకుంది....

చెరువు నీళ్ళు వరి మడికి పారిస్తూవున్నాడు వెంకన్న. పిల్లకాలువలోని నీరు సన్నగా గల గల మని శబ్దం చేస్తోంది.

"పెద్దయ్యా! పెద్దయ్యా!" అని చిన్న పిలుపు వినబడితే తిరిగి చూశాడు.

"ఎవరూ?" అన్నాడు.

"నేను మల్లేసుని" అంటూ వచ్చి చెంతగా వెంకన్న పక్కనే కాలువ గట్టు మీద కూచున్నాడు మల్లేసు.

"ఈ కయ్యేకటీ పారించి వస్తుంటి గదా నువ్వేలొస్తివి?"

మల్లేసు తనెందుకొచ్చిందీ చెప్పాడు. ఆశ్చర్యంగా చీకట్లోనే మల్లేసు మొహంలోకి చూశాడు వెంకన్న.

"ఉష్! మెల్లగా జెప్పరా.... గోల్లకి సెవులుంటాయి.... ఏందేంది పోలీసోల్లొచ్చిండ్రా?"— వెంకన్న.

"వచ్చిండ్రా కాదు పెద్దయ్యా! కేశవరెడ్డే పోలీసోల్లని పిల్లంపిచ్చినాడు"

"ఎంతన్నేయం!! ఎంతన్నేయం!!! కొల్లప్పని సంపింది గాక!!!"

"ఇంకా అసలిసయం యినూమల్ల"

"ఊఁ ఊఁ.... సెప్పు"

పోలీసోల్లని పిల్లంపిచ్చి.... కొల్లప్పకి ఆన్నెల్ల కింద ఎఱ్ఱి కుక్క కరిసిందనీ, దాన్నించి ఈ పొద్దు పద్దన కొల్లప్ప కెఱ్ఱి బట్టి కేశవరెడ్డిని కరిసేకి బొయినాడనీ, ఆయప్ప తన్ని రచ్చించు గొనేకి కొట్టినాడనీ, ఆ దెబ్బలకి కొల్లప్ప చచ్చి పొయినాడని సేటిమెంటిచ్చినాడు.... పెద్దయ్యా! శానా మంది సాచ్చికాలు గూడా సెప్పినారు. ఆ సాచ్చికం జెప్పినోళ్ళలో నేనొగన్ని పెద్దయ్యా!.... దొంగసాచ్చిం సెప్పినప్పన్నించి ఏందో తప్పు జేసినట్ల పానం పీకుతాంది పెద్దయ్యా!" ఆ మాటల్లో కొంచెం వణుకు వచ్చింది- మల్లేసు గొంతునించి.

"నువుగానేంజేస్తావురా!.... ఆళ్ళకి ఎదురు జెప్పి బతికే వోడెవుడు? కొల్లప్పకి జరిగిన అన్నేయాన్ని చూసయినా మనం బుద్ది దెచ్చుకోవల్లరా.... సమయమొస్తే ఈ గొప్పోల్లంతా ఒగటయి పోతుండారు. మనమూ? ఒగరి కొగరూ పట్టించుకోం.... కొల్లప్పకి నాయం జరిపించమని మన పేదోల్లంతా కల్సి అడిగింటే ఈ పొద్దు నాయమే జరిగేది.... కాని, అట్లలేం కాబట్టే కొల్లప్ప కేశవరెడ్డి పొగరుకి బలయిపోయినాడు. ఈ పొద్దు కొల్లప్పకి జరిగిన అన్నేయం రేపు మీ నాయనకీ జరుగుతాది.... ఆయప్పనీ ఏ ఎఱ్ఱి కుక్కో కర్సినట్ల నేనే సాచ్చిగం జెప్పాలిసొస్తుంది.... అంతే, తప్పదురా... మన పేదోల్లంతా ఒగటిగానంత కాలం.... అంతే! అంతే!!" ఆవేశంగా చెబుతున్నాడు వెంకన్న.

వరి మడి కయ్యి నీరు నిండి పొర్లుతోంది.

*

(1979 ఆగస్టు, ప్రజాసాహితి.)